భావితరాలకు దిక్సూచి నేటి విద్యార్థులే..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓయూ అకడమిక్ జేడీ శ్రీనాథ్‌రెడ్డి

రంగారెడ్డినగర్: భావితరాలకు దిక్సూచి నేటి విద్యార్థులేనని కష్టపడి చదివితే భవిష్యత్‌లో కలలు సాకారం చేసుకోవచ్చని ఓయూ అకడమిక్ జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గాంధీనగర్‌లోని సామ్రాట్ ఫంక్షన్‌హాల్లో బుధవారం శ్రీసాయికాలనీలోని శ్రీవిద్య జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే 'అఘాద్ 2023'నిర్వహించారు. ఈ వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ముందుగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ విశ్వనాథ్‌చారి, ప్రజాప్రతినిధులు, అధ్యాపక బృందంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింప చేయాలని తెలిపారు. అనంతరం గత సంవత్సరం ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ విశ్వనాథ్‌చారి, డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మహేష్‌కుమార్, విగ్నేశ్వర్‌రెడ్డి, నాయకులు కన్నెకంటి మల్లేష్, మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విద్యార్థుల ఆటాపాట

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జగద్గిరిగుట్ట: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షల్లో టోకారా పెట్టి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట పరిధి ఆల్విన్ కాలనీకి చెందిన వెంకటనాగపూర్ణ కిషోర్‌కు దూరపు బంధువైన ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా బావదారపల్లికి చెందిన మలిశెట్టి గోపీచంద్ తాను సోమాజీగూడలోని క్యాంట్ క్లౌడ్ సోల్యూషన్స్ కంపెనీలో డబ్బులు చెల్లించి ఉద్యోగం సంపాదించానని నమ్మ బలికాడు. కిషోర్ భార్యకు సైతం ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన గోపీచంద్ అతని వద్ద రూ.2.3 లక్షల నగదును తీసుకున్నాడు.



నిందితుడు గోపీచంద్

- అదే విధంగా కిషోర్ బావమరిది సుభాకర్‌కు సైతం జాబ్ ఇప్పిస్తానని చెప్పి మరో రూ.2.3 లక్షలు వసూలు చేశాడు. ఇలా సంతోష్ అనే వ్యక్తి నుంచి రూ.4 లక్షలు, శ్యామ్ సుందర్ (రూ.1.3 లక్షలు), లోకనాథం (రూ.1.25 లక్షలు), నర్సింహామూర్తి (రూ.90 వేలు), అనంతకుమార్ (రూ.1.90 లక్షలు), శ్రీమన్నారాయణ(2 లక్షలు), ధర్మతేజ (రూ.1.2లక్షలు) నుంచి గోపీచంద్ తీసుకున్నాడు.
- కిషోర్ భార్య, బావమరిదిలకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించిన గోపీచంద్ వారికి ఆఫర్ లేటర్, జాయినింగ్ లేటర్లను సైతం ఇచ్చాడు. దీంతో వారు సోమాజీగూడలోని అతను చెప్పి అడ్రస్‌కు వెళ్లగా సదరు కంపెనీ లేకపోవడంతో గోపిచంద్ కుటుంబ సభ్యులను సంప్రదించగా ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడని, అతని విషయం తెలియదన్నారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భౌరంపేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

డా. బీఆర్. అంబేడ్కర్‌కు నివాళి

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు నిమ్న, బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు అంబేడ్కర్ విశేష కృషి చేశారని అన్నారు. నేడు అన్ని వర్గాల ప్రజలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించారంటే ఆయన చలువేనని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలు సైతం అంబేడ్కర్ చూపిన అడుగుజాడల్లో నడవాలని కోరారు. – కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న ఎరుకుల సంఘం నాయకులు



జగద్గిరిగుట్ట బెటీపోస్ట్ వద్ద ఉమామహేశ్ ఆధ్వర్యంలో...



నిజాంపేట్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, దళిత నేతలు



గాంధీనగర్‌లో నివాళులర్పిస్తున్న జల్డా లక్ష్మీనాథ్ తదితరులు



నివాళులర్పిస్తున్న జగద్గిరిగుట కార్పొరేటర్ జగన్

పరిశ్రమల పొగలు.. ఉక్కిరిబిక్కిరితో ప్రజలు

జీడిమెట్ల: పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కాలనీలకు సమీపంలో ఉన్న ప్రజలు పరిశ్రమల నుంచి వెలువడే పొగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొగలు నేరుగా వస్తుండటంతో అపార్ట్‌మెంట్‌లలో ఉండే ప్రజలు ఉపిరి తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని అపురూపా కాలనీ, ఎస్ఆర్ నాయక్‌నగర్, వినాయక నగర్, సుభాష్‌నగర్ ప్రజలు కాలుష్యానికి గురి అవుతున్నారు. పరిశ్రమల పొగ గొట్టాల నుంచి నల్లటి పొగలు రాత్రివేళల్లో నేరుగా ఇళ్లల్లోకి వస్తున్నాయి.



ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

- దీంతో ఇళ్లల్లో ఉండేవారు ఉపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్స్‌కు పక్కనే ఉన్న పరిశ్రమల నుంచి నిత్యం పొగలు వస్తుండటంతో ప్రజలు దగ్గు, శ్వాసకోస జబ్బుల బారిన పడతున్నారు. పరిశ్రమల్లో బొగ్గును మండించడంతో నల్లటి పొగలు గాలిలోకి వెలువడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు పట్టించుకుని పొగను వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజల అభిమానం.. తాను చేసిన అభివృద్ధితోనే హ్యాట్రిక్ విజయం సాధించానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నికైన నేపథ్యంలో బుధవారం రంగారెడ్డినగర్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సమావేశం నిర్వహిస్తున్నారు. ఆదర్శనగర్ ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ... స్థానిక నాయకులు పట్టుదలతో పని చేయడంతో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో అఖండ విజయం సాధ్యపడిందన్నారు. నియోజకవర్గ ప్రజల రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిదని అన్నారు.
- గత రెండు పర్యాయాలు సీఎం కేసీఆర్ ఆశీర్వాదాలు, కేటీఆర్ సహాయ సహకారాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ గెలుపు తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. అంకిత భావంతో పని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.
- ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. సుధాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జయరాం, సుబ్బారెడ్డి, ఎండీ. గౌస్, సిరాజ్, ఖాజా మియా, లక్ష్మీనాథ్, లక్ష్మణ్‌గౌడ్, ఖాదర్, ఓంకార్‌రెడ్డి, అర్షద్, ఎం.శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్, సతీష్, రాజేష్‌గౌడ్, మాజీ ప్రజప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిపై అవగాహన అవసరం

నవజ్యోతి పాఠశాలలో హనుమాన్ చాలీసా పారాయణం



చింతల్: చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఎంతో అవసరమని నవజ్యోతి విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిర రవీందర్‌రెడ్డిలు అన్నారు. చింతల్ డివిజన్ పట్వారినగర్‌లోని నవజ్యోతి హైస్కూల్‌లో బుధవారం హనుమాన్ చాలీసా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల మేధోసంపత్తికి యోగ, మెడిటేషన్, పారాయణాలులలో సైతం విద్యార్థులు రాణించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

- ఈ సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, సత్యనారాయణస్వామి వ్రతం, పాఠశాల ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పఠనంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బంధువులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోలాటాలతో మహిళలు, ఆధ్యాత్మిక పాటలతో ఉపాధ్యాయులు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అందులో భాగంగా హనుమాన్ వేషధారణలో చిరంజీవి శ్రీకర్ రాజు అందరిని ఆకట్టుకున్నారు.
- అనంతరం పాఠశాల అదనపు నూతన భవనాన్ని ప్రారంభించారు. నవజ్యోతి పాఠశాలల అకాడమిక్ డైరెక్టర్లు రూపాంజలి, ఆదిత్యకృష్ణ, సంఘ సేవకులు కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, రామచంద్ర బాబు, పాఠశాలల ఇన్‌చార్జ్‌లు మారుతి, రామ్‌రెడ్డి ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాగాల సంపత్‌రెడ్డి కుంటుంబానికి అండగా ఉంటాం



సంపత్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: బీఆర్ఎస్ పార్టీ కుటుంబం లాంటిదని.. ఎవరికి నష్టం కలిగినా కుటుంబ పెద్దగా పార్టీ అధినేత కేసీఆ ర్ ఆదుకుంటారని ఎమ్మెల్సీ శంభీపూ ర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జనగామ జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సంతాప సభను గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంభీపూర్ రాజు, వివేకానంద్ మాట్లాడుతూ... సంపత్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలో లేకున్నా ప్రజల్లోనే ఉంటాం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న కార్యకర్తలు

కుత్బుల్లాపూర్: అధికారంలో లేకున్నా ప్రజా సమస్యలను పరిష్కరిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, నాయకులు ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి ఇన్‌చార్జ్‌గా రెండు ప్రాంతాల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఎమ్మెల్సీని సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా లేకున్నా ఎప్పుడు ప్రజల్లోనే ఉన్నామన్నారు. ప్రజల మద్దతుతో భవిష్యత్‌లో సైతం స్థానిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయించండి

జీడిమెట్ల: దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని సుభాష్‌నగర్ డివిజన్ ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని కాలనీల్లో దోమలు విపరీతంగా ఉన్నాయని కాలనీల ప్రజలు అంటున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా దోమలు కుడుతుండటంతో ప్రజలు మలేరియా, డెంగీ, జ్వరాల బారిన పడుతున్నారని ప్రజలు అంటున్నారు. సంపాదనలో ఉన్నదంతా జబ్బులకు, మందులకు పెడితే తాము ఏమి తిని బతకాలని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాల్సిన ఎంటమాలజీ సిబ్బంది కాలనీల వైపు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఫాగింగ్ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం

కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్



బాధితులతో మాట్లాడుతున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా తాను అండగా ఉంటానని.. వారికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తానని శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ వినాయకనగర్‌లోని శ్రీ జగదాంబ ట్రేడింగ్ పరిశ్రమలో ప్రేమ్‌చంద్, బింద్ర ప్రసాద్‌లు కార్మికులుగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా పని చేస్తున్న క్రమంలో ఇరువురి చేతి వేళ్లు తెగాయి. విషయం తెలుసుకున్న మదన్‌గౌడ్ పరిశ్రయ యాజమాన్యంతో మాట్లాడి ఒక్కొక్కరికి రూ.90 వేల చొప్పున నష్టపరిహారాన్ని ఇప్పించే విధంగా చర్చించారు. సదరు మొత్తాన్ని బాధితులకు మదన్‌గౌడ్ అప్పగించగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుల శ్రేయస్సు కోసం పని చేస్తానన్నారు. వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.